


# ది హీరోయిన్

శ్రీరాజ్

"జీవితం కేవలం ప్రవాహం లాంటిది.

కొత్త నీరు వచ్చినప్పుడు పాత నీరు కొట్టుకుపోతుంది. ఈ రోజు వెలిగిన నక్షత్రాలు రేపు చీకటిలో కలిసి పోతాయి." సుజాత మాటలకి అంతా చప్పట్లు కొట్టారు.

ఆమె పాత బతుక్కి; కొత్త జీవితానికి మధ్య తెరలు పడిపోయాయి. తెరల అవతల ఉన్న పాతబతుకును నెమరు వేసుకోవడమన్నా, తెరలుదాటి కొత్త జీవితంలో ఆనందాన్ని కరువు చేసుకోవడమన్నా – సుజాతకి యిష్టం ఉండదు. ఆమె పాత జీవితం ఎవరికీ తెలీదు. ఆమెకూడ పూర్తిగా మరిచి పోయింది.

* * *

పదో క్లాసయినా చదవని, పదహా రేళ్ళయినా నిండని చిన్నమ్మ నీళ్ళ బిందె చంకను పెట్టుకొని, ఎడంచేత్తో చీర కుచ్చెళ్లు పొందికగా పట్టుకొని,అడు గులో అడుగువేస్తూ, వయ్యారంగా వీధిలో నడుస్తుంది.

వీధిలో ఇళ్ళగోడలకు అప్పుడే కొత్త సినిమా పోస్టర్లు అంటిస్తున్నారు. సినిమా లంటే చిన్నమ్మకి చెప్పుకోనంత పిచ్చి. చిన్నమ్మ ఠక్కున ఆగిపోయింది. అడుగు ముందికి వేయాలనిపించలేదు. బొమ్మలో ఉన్న అమ్మాయిని చూసి బోలెడంత ఆశ్చర్యపోయింది. ఆ అమ్మాయికూడ అచ్చం తనలాగే కడవ చంకను పెట్టుకొని, వాలుజడ ముందుకి వేసుకొని, సోగకనులతో పరిసరాల అందాన్ని చూస్తూ, ముందుకి చిన్న చిన్న అడుగులు వేస్తుంది. అమాంతం చిన్న మ్మకి సిగ్గు ముంచుకువచ్చింది. సిగ్గుతో బరువైన చిన్నమ్మ బరువుగా అడుగులు వేస్తూ, ఇంటిదారి పట్టింది.

ఆ రాత్రి చాలసేపు చిన్నమ్మకి నిద్రపట్టలేదు. 'ఇది ఫలానా' అని చెప్పలేని అనుభూతి ఆమెతో దోబూచు లాడింది. మాటిమాటికి బొమ్మలో ఉన్న అమ్మాయిని, చిన్నమ్మని మార్చి మార్చి చూసింది. తలలో పెట్టుకున్న సన్నజాజులు విచ్చుకున్నాయి.

ఆకాశంలో తారలకు లేని విలువలు ఎన్నో - చిత్రసీమలో తారలకున్నాయి. తన దృష్టిలో యాక్టర్లు చాలా గొప్ప వాళ్లు. అంతకంటె అదృష్టవంతులు. తను స్టార్ అయితే?...

ఈ ఊహ రాగానే చిన్నమ్మ గుండె ఝల్లుమంది.

చందమామ మబ్బుల్లోకి జారు కున్నాడు. చిన్నమ్మ మెల్లగా నిద్రలోకి జారుకుంది. తర్వాత - ఈస్ట్‌మన్ కలర్‌లాంటి కలల్లో తేలిపోయింది.

మర్నాడు ఉదయం చిన్నమ్మ చక్కగా ముస్తాబై, వీధిచివరిలో ఉన్న ఓ నాటకసమాజానికి వెళ్ళింది.

చిన్నమ్మ చాలా అందంగా ఉంటుంది. ఎవర్నయినా యిట్టే ఆకర్షిస్తుంది. అంతో యింతో చదువుకుంది. చదువును మించిన తెలివితేటలు ఉన్నాయి. చురుకు దనం ఉంది. పొగరు ఉంది. కావలసి నంత 'జీల్' ఉంది. ఆమె మొదటి ప్రదర్శనలోనే ఉత్తమనటి బహుమతి గెలుచుకుంది. మరి నాలుగైదు నాట కాల్లో వేషాలువేసి, అందరి మెప్పు పొందింది.

ఒకసారి 'ఊళ్లో నాటకం వేసి నప్పుడు – చిన్నమ్మ తల్లి తాయా రుకి కూతురు వేషాలుకడుతున్నట్లు తెలిసింది. ఆమె మండిపడింది. ఆమెకు అభిమానం ఎక్కువ. కట్టుకున్నవాడు తనను ఒంటరిగా విడిచిపోయినా, కన్న కూతురికోసం ఆశలు పెంచుకొని, బ్రతుకుతుంది. బ్రతుకులో ఏ మాధుర్యం

లేకపోయినా, పరువుగా కాలం వెళ్ళ బుచ్చడంలోనే పరమార్థం ఉందని, భర్త మిగిల్చిన చిన్న మాగాణిలో సేద్యం చేస్తుంది. కన్నకూతురుకి కష్టం తెలియకుండా పెంచింది. రజస్వెరా లయ్యేవరకు చదువుచెప్పించింది. ఆ తర్వాత చదువు మాన్పించి, ఇంట్లో వంటలు, కుట్లు నేర్చుకోమని చెప్పింది. పొలం అమ్మి, చిన్నమ్మకి తొందరగా పెళ్ళిచేసి, నిశ్చింతగా పోవాలని ఆలో చించింది. కానీ, తనకు తెలియకుండా తన కళ్ళుమూసి, కన్నకూతురు వీధిలో పదిమంది ఎదట బల్లెక్కి తైతక్కలాడే సరికి తాయారుకి తలతీసినట్లయింది. ఎంతో గుట్టుగా సాగిపోతున్న జీవితాల్ని బజారునపెడుతుందని ఊహించలేక పోయింది. అబద్ధాలు చెప్పి, తనను మోసంచేస్తుందని అసలు అనుకోలేదు.

తాయారు అవమానంతో కుంచించుకు పోయింది.

మర్నాడు చిన్నమ్మను ఎడాపెడా తిట్టింది, తాయారు. మరోసారి వేషం కడితే, ఒళ్ళు చీరేస్తానంది. చిన్నమ్మ ఏమీ మాట్లాడలేదు. తల్లికి తెలిసి పోయినందుకు కంగారుపడింది. మన సులోని కోరికల్ని చంపుకోలేక తల్లికి ఎదురుచెప్పలేక మౌనంగా గది లోకి వెళ్ళి, వెక్కి వెక్కి ఏడ్చింది.

వారంరోజులు చిన్నమ్మ ఇంట్లో నుంచి కదల్లేదు. అనేకమైన ఆలోచనలు కన్నతల్లి కన్నీళ్ళు చూసి, కరిగిపో కూడదని నిశ్చయించుకుంది. తనధ్యేయం ఒక్కటే. ఎప్పటికైనా తను పెద్ద సినిమానటి కావాలి. తన పేరు ప్రతి ష్ఠలు పేపర్లలో పడాలి. తన బొమ్మ ప్రతి గోడమీద కనిపించాలి. తనలాంటి గొప్పనటి ఎవరూ లేరని అందరూ అనుకోవాలి. తన ఆశయం నెరవేర టానికి ఎవర్నయినా ఎదిరించాలి. ఎంతటి కృషయినా చేయాలి. చిన్నమ్మ ఆలోచించి, ఆలోచించి గుండె దిటవు చేసుకుంది.

చిన్నమ్మ నాటకాలేయడం మళ్ళీ మొదలెట్టింది.

ఆ విషయం తాయారుకి తెలిసింది. ఆమె సహించలేకపోయింది. పెళ్ళి కావలసిన పిల్ల విచ్చలవిడిగా మగ వాళ్ళతో వేషాలుకడితే, ఎవరు పెళ్ళి చేసుకుంటారనే బెంగ పట్టుకుంది. చిన్నమ్మ నడవడిమీద చాల చాల అను మానాలు కలిగాయి. విధి తనను ఎంత క్రూరంగా హింసించినా, ఏరోజునకూడ తను వీధిన పడలేదు. అభిమానంగా బ్రతుకుతూ, ఎవరిచేతా వేలెత్తి చూపించుకోలేదు. కానీ, ఉద్ధరిస్తుందను కున్న కన్నకూతురు ఉన్న పరువు మర్యాదలు మంటకలిపి, తనను సాధి స్తున్నందుకు తాయారు వలవల ఏడ్చింది.

తల్లీకూతుళ్ళ మధ్య చిన్న కురుక్షేత్రం జరిగింది.

"చిన్నమ్మా... నీ ప్రవర్తన బాగు లేదు. ఈ ఇంటి మర్యాదను మంట కలుపుతున్నావు... గుట్టుగా ఓ అయ్య చేతిలో పెట్టి, నా బాధ్యతలు తీర్చుకోవాలనుకున్నాను. కానీ, నాటకాలాడే నిన్నూ, నీ వేషాల్నీ చూసి ఎవరు పెళ్ళిచేసుకుంటారే నిన్ను?..." తాయారు కసిరింది.

"నన్నెవరూ పెళ్ళిచేసుకోనక్కర లేదు. అసలు నేను పెళ్ళిచేసుకోను... నాటకాలు వేయడం మానలేను. నేను పెద్ద సిన్మాస్టార్ని కావాలి. అదే నా ఆశయం." చిన్నమ్మ మొండిగా, ధైర్యంగా సమాధానం యిచ్చింది.

చిన్నమ్మ మొండితనానికి తాయారుకి ఒళ్ళుమండింది.

"ఛీ... నోర్ముయ్. నీతిమాలిన దానిలా బజార్నపడి గెంతుతావటే? మన ఇంటావంటా లేని బుద్ధులు నీకెలా వచ్చాయి? ఎవర్నిచూసి నేర్చుకున్నావే?... నన్ను కాదని నాటకాలు ఎలావేస్తావో చూస్తాను. ఎవరికో నిన్ను కట్టబెట్టకపోతే నేను నీ తల్లినే కాదు."

"అమ్మా... ఇది నా జీవితం. నా యిష్టం. నువ్వు బెదిరించడానికి నేనేమీ చిన్నపిల్లను కాను..."

చిన్నమ్మ యింకా ఏమో మాట్లాడబోయింది. మధ్యలోనే ఆమె చెంప ఛెళ్ళుమనిపించింది, తాయారు.


"నేను చచ్చింతర్వాత నీ యిష్టం వచ్చినట్లు ఊరేగు... కానీ, ఈ బొందిలో ప్రాణం ఉండగా నేను సహించను. నిన్ను వేషాలు వెయ్యనివ్వను."

తాయారు చాలా ఖచ్చితంగా అంది. ఆ మాటల్లో కఠినత్వం – చిన్నమ్మలో ఎలాంటి భావాలు సృష్టించలేదు. నిర్లక్ష్యంగా తల్లివేపుచూసి, విసురుగా గదిలోకి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి చిన్నమ్మ చాలసేపు ఆలోచించింది.

వేషాలు వేసేవాళ్ళంతా నీతిమాలిన వాళ్ళేనా? కళకోసం పాటుపడేవాళ్ళకు గౌరవమర్యాద లుండవా? పరువూ ప్రతిష్ఠా అంటూ పిచ్చిగా చిత్రించుకొని అనుమానపు టద్దాలలో నీతిని వెదికే వాళ్ళకి–అందరూ నీతిమాలినవాళ్ళుగానే కనిపిస్తాను. కన్నకూతురి అభివృద్ధిని కాంక్షించవలసిన తల్లి అర్థ రహితంగా మాట్లాడినందుకు ఆమెకు జుగుప్స కలిగింది.

మనిషిగా పుట్టినందుకు మరో మనిషికి తోడుకావాలి. పిల్లల్ని కనాలి. గుట్టుగా నాలుగుగోడలమధ్య సంసారం సాగించి, కట్టుకున్నవాడిచేతిలోనో తను కన్నపిల్లల చేతుల్లోనో కడతేరిపోవాలి. ఇదేనా జీవితం? అటువంటి జీవితం తను




కోరుకోలేదు. తనలో చోటుచేసుకున్న కళకు చోటులేకుండాచేసి, తల్లి చాటున ప్రతి క్షణం కుళ్ళిపోతూ, తన అంతరాత్మకు ద్రోహం చేయలేదు. తనలో ఆశయాల్ని సమాధిచేసి, మానసికంగా నరకాన్ని అనుభవించలేదు. ఎక్కడో సుదూరాలకి పోవాలి. తన స్వేచ్ఛకి భంగం కలగనిచోటుకి, తన ఆశయాలు నెరవేరే చోటుకి వెళ్ళిపోవాలి. తను ఎక్కడకు వెళ్ళినా బ్రతకగలదు.తనకా నమ్మకం ఉంది.

చిన్నమ్మలో తెగింపు - చైతన్యం స్రవంతి అయింది.

అంతే!

ఇంట్లో ఉన్న కొద్దో గొప్పో నగలూ, వెనుక కూడబెట్టుకున్న అంతో యింతో డబ్బూ తీసుకుంది.

బుర్రుపిట్ట తుర్రుమంది.

* * *

చెన్నపట్నం చేరిన వారంరోజుల తర్వాత—చిన్నమ్మ ఊహించుకున్న రంగులజీవితంలో రంగులు వెలిసిపోయాయి. ఎక్కడైనా బ్రతకగలిగే నమ్మకం కరిగిపోయింది. మనసులో భయం చోటుచేసుకుంది. ఏ స్టూడియోకి వెళ్ళినా, ఎవర్ని ఆశ్రయించినా ప్రయోజనం లేకపోయింది. ప్రతిచోటా తననొక ఆటబొమ్మగా ఊహించి వెకిలిచేష్టలు చేసే మగవాళ్ళను చూసి బెంగపడిపోయింది. తనలాంటి అభాగ్యులు ఎందరు ఉన్నారో?

ఒకరోజు సాయంత్రం—చిన్నమ్మ కూర్చొని, ఎక్కడో దూరంగా సముద్రమూ ఆకాశమూ కలిసిఉన్నట్లు

కనిపిస్తున్న వేపు చూస్తుంది. అది వట్టి భ్రమ.

ఆమెలో ఆలోచనలు ముసురు కున్నాయి.

తన చేతిలో మిగిలిఉన్న డబ్బు మరో రెండురోజుల్లో అయిపోతుంది. హాస్టలునుండి పొమ్మంటారు. తను రోడ్డుమీద పడక తప్పదు. తన బతుకులో చీకట్లు ముసురుతాయి. తను రాబందుల చేతుల్లోపడి నాశనం అయి పోతుంది. తనూహించుకున్న స్వప్నాలు శాపాలుగా మారి తనను క్షణ క్షణం చిత్రహింస చేస్తాయి. కానీ, తను భరించగలదా?

చిన్నమ్మ తన మనసుని సమాధాన పరచుకొని, మొండిగా ఓ నిర్ణయానికి వచ్చింది. కళ్ళముందున్న సముద్రం ఉరకలు వేస్తుంది. తనలో ఉరకలు వేసిన కోర్కెల్ని చంపుకొని, ఉరకలు వేస్తున్న సముద్రములో దూకి, తను చావాలి. ఏ ఆడపిల్లా తనలాగా కన్న తల్లి గుండెల్లో చిచ్చుపెట్టి, రంగు బొమ్మ కావాలని భ్రమతో బ్రతుకు నాశనం చేసుకోకూడదు. జీవితంలో జరిగిన ఎన్నో సంఘటనలు, మరిచి పోలేని మధురానుభూతులు కళ్ళముందు కదిలాయి. కళ్ళు చెమ్మగిల్లాయి.

చిన్నమ్మ జీవితంలో ఓ కొత్త పుట 'డోంట్ క్రై' అని రెపరెపలాడింది.

ఎవరో కెవ్వున అరిచి, విరుచుకు పడిపోయినట్లు విని, చిన్నమ్మ ఉలికిపడి ప్రక్కకు తిరిగి చూసింది. ఒక యువతి కిందపడి, గిలగిల కొట్టుకుంటుంది. ఆమె భర్త కాబోలు-కంగారుగా ఆమెను పిలుస్తున్నాడు. ఇద్దరు పిల్లలు బెంగగా ఆమెను 'అమ్మా అమ్మా' అని పిలుస్తు న్నారు. హఠాత్తుగా జరిగిన సంఘటనకి ఆశ్చర్యపోతూ, చిన్నమ్మ వాళ్ళను సమీపించింది.

చిన్నమ్మ జరిగిందేమిటని అడిగినా, అతను సమాధానం యివ్వలేదు. ఆమె పరిస్థితి చూసాక, చిన్నమ్మ జరిగిం దేమిటో గ్రహించగలిగింది. హిస్టీరి యాతో బాధపడే ప్రక్కింటి సరోజమ్మ గుర్తొచ్చింది. సరోజమ్మ ఫిట్సు వచ్చే టప్పుడు పిచ్చిగా అరిచి, విరుచుకు పడిపోయేది. నాలుగైదు గంటలకి గాని ఆమెకి తెలివి వచ్చేదికాదు


చిన్నమ్మ చొరవచేసింది. ఆమెను తన ఒడిలోకి తీసుకొని, తెలిసిన సాధ నాలన్నీ చేసింది. ఆమె కొంచెం స్పృహలోకి రాగానే అతనితో అంది— "తొందరగా ఇంటికి తీసుకెళ్ళి, డాక్టర్ని పిలిపించండి."

"థాంక్స్...మీకభ్యంతరం లేక పోతే, సాయంగా మీరూ రండి" అని అతను అభ్యర్థించాడు. చిన్నమ్మ 'అవునూ కాదూ' అనే లోపల అతను కారు సిద్ధంచేశాడు.

డాక్టరు వచ్చి, రెండుమూడు



యువ




ఇంజక్షన్లు యిచ్చి వెళ్ళిపోయాడు. నిజానికి ఆమెకి పెద్ద ప్రమాదం ఏమీ లేకపోయినా, అతను యించుమించు పెద్ద ఆర్భాటం చేశాడు. ఆమెని చూడ్డానికి చాలామంది స్నేహితులు, బంధువులు వచ్చారు. వచ్చినవాళ్ళు కంగారుపడుతూ అతన్ని ప్రశ్నలతో క్షణం తీరిక లేకుండా చేశారు ఉన్నవాళ్ళకి ఏ చిన్న ఆపద వచ్చినా. ఆప్యాయతగా మాట్లాడే మనుషులకి కొదవ ఉండదు. ఆ ఆప్యాయతలు నిజమైనవి కాకపోవచ్చు. కానీ, లేనివాళ్ళకి ఉత్తుత్త ఆప్యాయతలుకూడ లభించవు అనుకొంది చిన్నమ్మ.

అతని గురించి తెలుసుకోడానికి చిన్నమ్మకి ఎంతోసేపు పట్టలేదు. అతని పేరు ముకుందరావు. చెయ్యి తిరిగిన లాయరు. బంగళాలూ, కార్లూ, క్లబ్బులూ, బ్యాంకులూ, అకౌంట్లూ, అసోషియేషన్లూ—ఉన్నవాళ్ళకి ఉండవలసిన లక్షణాలన్నీ అతని కున్నాయి. ఒక్క—రాత్రిలో-కొన్ని గంటల్లో వచ్చిన కారుల్నీ, మనుషుల్నీ చినమ్మ లెక్క—పెట్టలేకపోయింది. ఆశ్చర్యపోయింది.

రాత్రి పన్నెండుగంటలు కావొచ్చింది. అప్పటికిగాని ఇంట్లో చల్లబడలేదు. వచ్చినవాళ్ళందరూ వెళ్ళిపోయారు. చిన్నమ్మ—ముకుందరావుగారి దగ్గరకి వెళ్ళి, సెలవడిగింది.

"అయాం సారీ...మిమ్మల్ని మరిచిపోయాను. మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో నాకు తెలీడంలేదు. మా శ్రీమతికి ఫిట్సు రావడం ఇదే మొదటిసారి. సమయానికి మీరు హెల్ప్

చేయకపోతే మా సునంద ఏమైపోయేదో! ఊహించటానికి భయంగా ఉంది." ముకుందరావుగారు కృతజ్ఞతగా చెప్పారు.

"నేను చేసింది ఏమీలేదండీ..." చిన్నమ్మ యిబ్బందిపడిపోయింది.

"అలా అనకండి. ఫస్టెయిడ్ చేసిన మిమ్మల్ని డాక్టరుగారు అభినందించకుండా ఉండలేకపోయారు ... ఎక్కడుంటున్నారో చెప్పండి. డ్రాప్ చేస్తాను."

"నేను నడిచి వెళ్ళిపోతానండి..."

"నో...నో...అర్ధరాత్రి ఒంటరిగా వెళ్ళడం మంచిదికాదు "

"నేను ఒంటరిదాన్నే...ఒంటరిగా వెళ్ళడం నాకు అలవాటే."


"ఎక్స్ట్రీమ్లీ సారీ...ఈ రాత్రి వేళ వెళ్ళడానికి వీల్లేదు. ఇక్కడే ఉండండి. ఉదయం మాట్లాడుకుందాం." ముకుందరావుగారు నౌకర్లని పిలిచి, పనులు పురమాయించి తన గదిలోకి వెళ్ళిపోయారు.

మర్నాడు ఉదయం సునంద – చిన్నమ్మని పిలిచి, వివరాలన్నీ అడిగింది. మొదట్లో చిన్నమ్మ ఏమీ చెప్పలేక మౌనంగా ఉండిపోయింది. ముకుందరావుగారు కలుగజేసుకొని, లాలనగా అడిగేసరికి–చిన్నమ్మకి తన గురించి చెప్పక తప్పలేదు.

అంతా నిజంచెప్పినప్పటికీ, తనకు తల్లి ఉందనిమాత్రం చెప్పలేదు. చెబితే తనను మందలించి, ముకుందరావుగారు తిరిగి వెళ్ళిపొమ్మంటారని, అక్కడ అందరిముందూ అవమానంతో తలవంచుకోవాలని, తను ఒంటరినని కంటనీరు పెట్టుకుంది. ఆమె చెప్పిన కథ విని, అతను జాలిపడ్డాడు. ఆమెకు సహాయం చేయాలనే ఆలోచన కలిగింది.

ఆ రోజే చిన్నమ్మ జీవితంలో అదృష్టం ప్రవేశించింది. ముకుందరావుగారికి సినిమా ప్రపంచంలో చాలా మందితో పరిచయం ఉంది. అతను కావాలని ఎవర్నయినా, ఏమైనా అడగాలే కాని కాదనేవారు లేరు. తనకు బాగా చనువున్న నిర్మాతలకి, డైరెక్టర్లకి ముకుందరావుగారు – పేరు మార్చి చిన్నమ్మని సుజాతగా పరిచయం చేశారు. సుజాత తనకి కావలసిన బంధువనీ, సరదాగా సిన్మాల్లో నటించాలని ముచ్చటపడుతుందనీ మామూలుగా చెప్పారు. అతను అడిగిన వాళ్ళెవరూ అతని మాటను కాదనలేదు.

పెద్దవాళ్ళకి మనసులో ఆలోచన కలిగితే, ఆశ్రితుల్ని అందలం ఎక్కించగలరు. దిక్కూ మొక్కూ లేనివాళ్ళకి కూడ సహజంలో క్షణాల్లో గుర్తింపు తీసుకురాగలరు. ఆ నిజం చిన్నమ్మ జీవితంలో రుజువయింది. ఒక్క క్షణంలో ఆమె జీవితమే మారిపోయింది. ఒకనాడు వెన్నెల్లో పడుకొని, ఆకాశంలో తారల్నిచూస్తూ తను స్టారయితే



బావుణ్ణని ఊహించుకుంది ఆ ఊహ నిజమై, కోరుకున్న రంగులజీవితం చేతికి అందినప్పుడు — చిన్నమ్మ నిజంగా ఆశ్చర్యపోయింది. ముందు రోజు వరకు ఎవరికీ తెలియని చిన్నమ్మ-చిన్నమ్మనుండి తొలగిపోయింది. రెక్కలు విప్పుకొని, కొత్తజీవితం సుజాతని కోరుకుంది. ఆమె బ్రతుకులో నిశాళ్ళి చంపి, వెలుగునిచ్చింది.

తొందరగా ముగిసిన ఇంగ్లీషు సినిమాలా అయిదేళ్ళు గడిచిపోయాయి.

సుజాత జీవితక్రమం మారిపోయింది. డబ్బు-ఆమె అంతస్తుని అంచనా వేయని ఎత్తుకి పెంచింది. సమాజంలో గొప్పవాళ్ళ జాబితాలో చేర్చి పేరుతెచ్చింది. హోదాతోబాటు సంస్కారాన్నీ, తెలివితేటల్నీ ప్రసాదించింది. మరిచిపోలేని సంఘటనలతో

అల్లికచేసి, ఆమె జీవితాన్ని పూలబాట చేసింది.

సుజాతకి సినిమాతారగా ఓ ప్రత్యేకత ఉంది. ఆమెను తమ చిత్రాల్లో బుక్ చేసుకోవాలని నిర్మాతలు క్యూలో నిల్చుంటారు. ప్రజలు ఆమె చిత్రాలకోసం—టిక్కెట్లకోసం క్యూలో నిల్చుంటారు. చిన్న వేషమైనా పెద్ద వేషమైనా శ్రద్ధగా చేస్తుంది. ఏ వేషానికైనా ఒకే కిరాయి తీసుకుంటుంది. ఆమె ఇండస్ట్రీకి పెద్ద 'యస్సెట్'. యువ తరంలో నవచైతన్యం. ఆమెను సన్మానించని సమాజంలేదు. ఆమె పేర అభిమానసంఘం లేని ఊరులేదు. ఇండియా రిప్రజెంటేటివ్‌గా అమెరికా వెళ్ళింది. భారతీయ చిత్రాలపై రష్యాలో లెక్చర్లు యిచ్చింది.

సుజాత వైకుంఠపాళీలో నిచ్చెనలన్నీ ఎక్కి, పంటగడిలో చేరిపోయింది. జీవితంలో కోరుకోవలసింది, మిగిలిపోయింది ఏమీలేదు

* * *

సన్నసన్నగా చీకటి పడుతుంది.

డ్రైవరు రామస్వామి నెమ్మదిగా కారు నడుపుతున్నాడు. వెనకసీట్లో కూర్చున్న సుజాత పరిసరాల్ని చూస్తుంది ప్రతిరోజూచూసే, ఆ పరిసరాలు చాలా కొత్తగా కనిపిస్తున్నాయి మనసుకి ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. జీవితంలో మరచిపోలేని రోజు. ఎక్కడో కిందమెట్టుమీద ఎవరికీ తెలియకుండా రాలిపోయే తన బతుక్కి చాలా పెద్ద ఉన్నతి ఏర్పడింది. గంటక్రితం వరకు తను మామూలు సుజాత. ఇప్పుడు 'ఊర్వశీ' సుజాత ప్రభుత్వం తనకు పూలకిరీటం తగిలించింది. సంతోషంతో గాలిలో తేలిపోతున్న తనకు సరదాగా రామస్వామితో మాట్లాడాలనిపించింది.

సుజాత హుషారుగా రామస్వామిని పిలిచింది అతను పలికాడు, కానీ.అతను పలికినట్లులేదు, మూలిగినట్లు ఉంది.

"ఏయ్ ... రాంస్వామీ; అలా డల్‌గా ఉన్నావు. ఏంవిటి కథ?" సుజాత ప్రశ్నించింది. రాస్కెల్... మూలుగుతున్నాడు. తనకు ఊర్వశీ అవార్డు వచ్చిందని తెలీదుకాబోలు. మనసులో విసుక్కుంది.

"బాగానే ఉన్నా నమ్మగారూ!..." ఏదో చెప్పాలన్నట్టు చెప్పాడు, రామస్వామి.

"అబద్ధం చెబుతున్నావు. మీ అమ్మగారికి ఊర్వశీ అవార్డు వచ్చింది...ఈ రోజు నువ్వెంతో ఉత్సాహంగా సంతోషంగా ఉండాలి...ఉండాలికాదు. నువ్వు ఉంటావు కానీ, నువ్వు నీరసంగా..."

మధ్యలో రామస్వామి తన నీరసానికి సంజాయిషీ చెప్పుకున్నాడు.

"నాకు జ్వరం తగిలిందమ్మగారూ'..."

"అలా ఎందుకు నాతో చెప్పలేదు?...

కారాపు నేను డ్రైవ్ చేస్తాను. వెనక్కి వచ్చి కూర్చో..."

"ఫరవాలేదమ్మగారూ!... జ్వరమే కదా? తగ్గిపోతుంది"

"నో...నో...నే చెప్పినట్లు విను. కారాపు."

సుజాత గద్దింపుగా మాట్లాడేసరికి, రామస్వామి కారాపి, వెనక్కి వెళ్ళి కూర్చున్నాడు. సుజాత కారు స్టార్టు చేసింది.

రామస్వామికి చాలా యిబ్బందిగా ఉంది.

"అమ్మగారూ! ... మాలాటివాళ్ళకి జ్వరం రాదండి. ఒకవేళ వచ్చినా, లెక్కచేయం. అదే పోతుంది."

"ఎందుకని? మీరు మనుషులు కారా?"

"ఈ జ్వరంమీద మా తాత చిన్న కథ చెప్పేవాడు. ఆ కథ వింటే, మీరు నా మాట నమ్ముతారు." తర్వాత రామస్వామి నాలిక కరుచుకున్నాడు.

సుజాత ఆశ్చర్యపోయింది. ఇందాకటి కోపం పోయింది. ఆ కథ వినాలనే క్యూరియాసిటీ కలిగింది.

"యీజిట్...అయితే, ఆ కథ నేను వినాలి."

"క్షమించండి, అమ్మగారూ; అది క్లాసు ఫోర్ కథ."

"నేను క్లాసు ఫోర్ కథలు వినకూడదని రూలుందా?... రామస్వామీ! మార్జిన్ పెట్టి, నన్ను మభ్యపెట్టకు. ఆ కథ వినాలని నాకు కుతూహలంగా ఉంది."

కారు నెమ్మదిగా పోతుంది.

రామస్వామికి కథ చెప్పక తప్ప లేదు.

"అమ్మగారూ !... మొట్టమొదట 'జ్వరం' మనుషుల మధ్యకి వచ్చేముందు ఎవర్ని పట్టుకోవాలా అని చాలాసేపు ఆలోచించిందట. ఆలోచించి, ఆలోచించి పశువులు కాసే ఓ కుర్రాడి ఒంటిమీదికి చేరిందట. ఒళ్ళంతా వేడెక్కి ఏదో బాధ కలిగేసరికి, వాడు నేలమీద నాలుగు కమ్మలు పరుచుకొని, యిష్టం వచ్చినట్లు దొర్లాడట. పత్యం చెయ్యకుండా వేన్నీళ్ళు తాగి మొండికెత్తాడట. వాడి దగ్గర ఏ సుఖమూ పొందలేక, రెండో రోజున జ్వరం వాణ్ణి విడిచిపెట్టి పారిపోయిందట.

"ఆ తర్వాత—ఓ మహారాజుని పట్టుకుందట. ఆ రాజుగారు బోలెడంత కంగారుపడిపోయి, మంత్రిగారికి కబురుచేశారట. ఆ మంత్రిగారు పెద్ద పెద్ద డాక్టర్లని పిలిపించారట. రాజుగారు కదలకూడదని, కాలు నేలమీద ఉండకూడదని, విశ్రాంతి ఎంతయినా అవసరం అని వచ్చిన డాక్టర్లు చెప్పారట. రాజభవనంలో పెద్ద దుమారం లేచిపోయింది. రాజుగారు మెత్తని పరుపులమీద పడుకొని, కాలు కింద పెట్ట లేదట. అతనికి ఉపచారాలు చేయటానికి చాలమంది పరిచారికల్ని పెట్టారట.

తియ్యటి మందులు పట్టారట. కోరిన పళ్లూ పదార్థాలూ యిచ్చారట. అడిగిన పానీయాలు త్రాగించారట. సుఖం మరిగిన 'జ్వరం' రెండునెలల తర్వాత గాని రాజుగార్ని విడిచిపోలేదట."

"అమ్మగారూ! సుఖపెట్టేవాళ్ళ దగ్గర సుఖపడాలని 'జ్వరం' చాలా కాలం ఉంటుంది గాని కష్టపడేవాళ్ళ దగ్గర, కష్టపెట్టే వాళ్ళదగ్గర 'జ్వరం' ఎంతోసేపు ఉండలేదు ... అందుకే, మాలాంటివాళ్లు జ్వరాన్ని లెక్క-చేయరు."

రామస్వామి చాల గమ్మత్తుగా నవ్వు కలిగేలా ఆ చిన్నకథను చక్కగా చెప్పాడు. సుజాత కథ విని, పగలబడి నవ్వింది. ఉన్నవాళ్ళకి లేనివాళ్ళకి మధ్యఉన్న భేదాన్ని చిన్న కథ స్పష్టం చేసింది. మరీమరీ తలచుకొని, పొట్ట చెక్కలయ్యేలా నవ్వింది. అమ్మగారు నవ్వుతున్నారని రామస్వామి సంబరపడి పోయాడు.

సుజాత హుషారుగా కారు స్పీడు హెచ్చించింది. నవ్వడంవలన ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి. చెమ్మగిల్లిన ఆ కళ్ళకి నడుస్తున్న జనం, వెలుగుతున్న దీపాలు మబ్బు మబ్బుగా అగుపించాయి. ఎవరో కారుకి అడ్డంగా వస్తున్నట్లు అస్పష్టంగా కనిపించేసరికి సుజాత సడన్‌బ్రేక్ వేయాలని ప్రయత్నించింది. కానీ, బ్రేక్ పడకముందే ఎవరో కారుకింద పడిపోయారు.

హఠాత్తుగా జరిన సంఘటనకి సుజాత నిలువునా వణికిపోయింది. రామస్వామి కారు డోరు తెరిచి, సుజాతని కారు దిగి పొమ్మని తొందరచేశాడు. ఆమె అచేతనంగా స్టీరింగు విడిచి, వెలుపలికివచ్చింది. క్షణంలో కారు చుట్టూ జనం మూగిపోయారు. కొందరు కారుగలవాళ్ళను మాటలతో చిత్రహింస చేస్తున్నారు. మరికొందరు కారుకిందపడిన వ్యక్తిమీద సానుభూతి కురిపిస్తున్నారు వాతావరణంలో నిశ్శబ్దం లేదు. సుజాతగుండెల్లో భయం చోటుచేసుకుంది. చుట్టూఉన్న జనంతో మాట్లాడలేక మౌనంగా ఉండిపోయింది.

జనంలో ఎవరో గుర్తుపట్టారు, ఆమె సినిమా తార సుజాతని. అంతే! అంతా ఆమెచుట్టూ చేరిపోయారు. పిచ్చి అభిమానంతో ఆమెతో మాట్లాడాలని ఎగబడ్డారు జరిగిన ప్రమాదాన్ని మరిచిపోయి, ఆమె నోటి ముత్యాలకోసం తహతహ లాడిపోయారు.

"సినిమాతార ... హీరోయిన్ ... సుజాత ... ప్లీజ్ ! మీ ఆటోగ్రాఫ్ యివ్వండి ... దేవతల చిత్రంలో మీ నటన అద్భుతం, మేడమ్ ... ఇంకా ఎన్ని చిత్రాల్లో నటిస్తున్నారు ? ... మీ పేర అభిమానసంఘం పెట్టామండి... ఎంతందంగా వున్నారు ... ఈ నోట్ మీద సైన్‌చేయండి ... మీలాంటి పెద్ద తారలు ప్రజలకి ఉపకారం చేయాలి... మీ ఫొటో పంపించమని కనీసం పది

ఉత్తరాలైనా రాసివుంటానండి ... మేడమ్ ! మీరు హాలివుడ్ చిత్రాల్లో ట్రై చేయకూడదూ ? ... ఆటోగ్రాఫ్ యివ్వండి. ప్లీజ్, ఈ పెన్నూ, కాగితం తీసుకొండి ... నాకు సిన్మాల్లో చేరాలని వుందండి ... మీరు గొప్పగా నటిస్తారండి. మీరు వుంటే చాలు, ఏ సినిమా అయినా చూడాలనిపిస్తుంది ..." ఇంకా యింకా అంటున్నారు సుజాతకి ఎవరి మాటలూ వినిపించటంలేదు. అంతా పిచ్చిగా అరుస్తున్నట్లుగా వుంది. చికాకనిపించింది.

రౌండ్సు తిరుగుతున్న 'యస్సయి' యాక్సిడెంటు జరిగిన చోటుకి పరుగెత్తుకు వచ్చాడు. సుజాతని చూసి, విస్తుపోయాడు. ఆమె చుట్టూవున్న జనసందోహాన్ని క్షణంలో దూరం చేశాడు.

"మేడమ్ ... ఇక్కడ మీరు వుండటం మంచిదికాదు. టాక్సీ పిలుస్తాను. మీరు వెళ్ళిపొండి. మీ డ్రైవర్ని వుంచండి. మిగతా విషయాలు నేను చూసుకుంటాను ... ప్లీజ్ ..."

సుజాత కాలికి ఏదో వెచ్చగా తగిలింది. కిందికి చూసింది. ఆమె కాళ్ళకున్న చెప్పులు పూర్తిగా రక్తంతో తడిసిపోయాయి. రక్తం ప్రవహిస్తుంది. కనీ కనిపించని దీపాల వెలుగులో వింత వింత రంగుల్లో రక్తం కనిపిస్తుంటే ఆమెకి గగుర్పాటు కలిగింది. ఆమెకి కారు చక్రాలవేపుచూసే ధైర్యం చాల్లేదు. అక్కడనుండి తొందరగా పారిపోవాలనిపించింది.

క్షణాల్లో టాక్సీ రావడం, సుజాత జనాన్ని తోసుకుంటూ వెళ్ళిపోవడం జరిగిపోయాయి.

ఆ రాత్రి – సుజాత ముకుందరావు గారికి ఫోన్‌చేసి, జరిగిన న్యూసెన్స్ చెప్పింది. అప్పటికప్పుడే ముకుందరావు గారు వెళ్ళి, రామస్వామిని 'బెయిల్' మీద విడిపించుకు వచ్చారు.

* * *

చల్లగా గాలి వీస్తోంది బాల్కనీలో అందంగా అమర్చిన పూలకుండీలలో పరిమళాలు గదంతా పరచుకున్నాయి. సుజాత స్వింగ్ క్రేడిల్‌మీద కూర్చొని, అభిమానులు రాసిన ఉత్తరాలు అలవోకగా చదువుతుంది. కొన్ని వుత్తరాలు ఆమెకి నవ్వు తెప్పిస్తున్నాయి మరి కొన్ని ఆలోచనల్ని కలిగిస్తున్నాయి. ఉత్తరాలు... సన్మానాలు... సభలు... విందులు...ఇంటర్వ్యూలు...పొగడ్తలు ... ఫొటోలు ... 'ఊర్వశీ' అయినప్పట్నుంచి సుజాతకి క్షణం తీరిక వుండటం లేదు.

సెక్రటరీ వచ్చి, ఆ రోజు న్యూసు పేపర్లు సుజాతకి అందించాడు. వుత్తరాలు ప్రక్కకుపెట్టి, ఒక పేపరు చేతిలోకి తీసుకుంది. ప్రతి పేపర్లో సుజాత ఫొటో వుంది పెద్ద పెద్ద అక్షరాలతో– 'ఊర్వశీ గ్రహీత సుజాత' అని రాసి వుంది. ముందురోజు జరిపిన ఇంట

ర్వ్యూను ప్రచురించారు. ఎన్నో పొగడ్తలతో ఆమెను ఆకాశానికి ఎత్తారు మరెన్నో వ్యాఖ్యానాలతో మనీషిని చేశారు. అవి చదివి, ఆమె గర్వంగా నవ్వుకుంది.

"మేడమ్ ... మరో శుభవార్త. ఆ రోజు ప్రమాదంలో మన తప్పు ఏమీ లేదని రుజువయింది." సెక్రటరీ వుత్సాహంగా అన్నాడు.

"అంటే ? ..." సుజాత ప్రశ్నార్థకంగా చూసింది.

"మీ కారుకింద పడింది - దిక్కూ మొక్కూలేని ఓ పిచ్చిది...మేడమ్ ! ఆ పిచ్చిది మన టౌన్లో చాలాకాలంగా తిరుగుతుండట ఆ వివరాలన్నీ పేపర్లో కూడ వేశారు. చివరి పేజీ చూడండి. ఫొటో కూడా వుంది."

సుజాత పేపరు తిప్పింది

"మేడమ్... ఆ పిచ్చిదానికి వెనకా ముందూ ఎవరూ లేరట ... కాంపన్సేషన్ కూడా యివ్వనక్కరలేదు నిమిషాల్లో కేసు సెటిలయిపోతుంది..." సెక్రటరీ చెప్పుకుపోతున్నాడు.

పేపర్లో ఫొటో చూసి, సుజాత దిగ్భ్రమచెందింది. శవాన్ని పోస్టుమార్టంకి పంపించేముందు తీశారా ఫొటో. పిచ్చిదాని పొట్టమీద కారు చక్రాలు నిలబడి వున్నాయి. ముఖం మాత్రం స్పష్టంగా కనిపిస్తుంది. సుజాత ఆ ముఖాన్ని తేరిపార చూసింది. అనుమానంలేదు, ఆమె తన తల్లి తాయారు. ఆ ముఖం తనను చూసి వెక్కిరిస్తున్నట్లు, నవ్వుతున్నట్లు, మందలిస్తున్నట్లు ఏడుస్తున్నట్లు - రకరకాలుగా కనిపించింది.

సుజాత హృదయంలో అగ్నిపర్వతాలు బ్రద్దలయ్యాయి. ప్రజ్వరిల్లిన మంటల్ని ఆర్పడంకోసం అన్నట్లు వెచ్చటి కన్నీరు ధారాపాతంగా కిందికి జారిపోతుంది. పాతజ్ఞాపకాలు మస్తిష్కంలో మెదిలాయి. అంతరాత్మలో చాలా ప్రశ్నలు కదిలాయి. తన కారు కిందపడి, చనిపోయిన పిచ్చిది - తన తల్లి అని ఎవరితో అనగలదు? బ్రతుకు నిచ్చిన కన్నతల్లి బ్రతుకును తానే నాశనం చేసిందని ఎవరితో ధైర్యంగా చెప్పగలదు ?

ఎర్రటి రక్తం. ఆ రక్తంలో నిర్జీవంగా పడివున్న తాయారు. ఆమె కళ్ళలో మిగిలిపోయిన ప్రేమా, వెచ్చని కన్నీళ్ళు...కన్నీటిలో ముసుగు చాటు చేసుకున్న తను ... తనలో 'మరో మనిషి' అనుభవిస్తున్న ఆవేదన ... ఆ స్తవ్యస్తమైన భావపరంపరతో, సుజాత విచలిత అయిపోయింది.

ఆమె కెవ్వున అరిచింది.

"మేడమ్ ... మేడమ్ ... ఏంటిటి, అలా అయిపోతున్నారు ?...ఏం జరిగిందండీ? ... " సెక్రటరీ కంగారు పడిపోయాడు. ఆమె ముఖంలో భావాలు ఆతనికి కొత్తగా కనిపించాయి.

సుజాత మాట్లాడలేదు.

తెలివి తప్పి, కిందికి ఒరిగిపోయింది.